క్లుప్తంగా

వేడుకగా సాయి విగ్రహ ప్రతిష్ఠ



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

అంబాజీపేట: గంగలకుర్రు సాయినగర్‌లో నేదునూరి నాగేశ్వరరావు, వెంకట రమణి దంపతులతో షిర్డీ సాయినాథ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. సాయినాథ స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, మండప పూజ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు, పూర్ణాహుతి చేశారు. సాయంత్రం సాయిబాబా వారి భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు.

గోగన్నమఠంలో శాంతి హోమం



గోగన్నమఠంలో జరిగిన పూజల్లో పాల్గొన్న మహిళలు

మామిడికుదురు: గోగన్నమఠంలోని ధనమ్మ, సోమాలమ్మ అమ్మ వార్ల ఆలయ ప్రాంగణంలో ఆదివారం శాంతి హోమం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవార్లకు పలు ప్రత్యేక పూజలు జరిపించారు. ఇటీవల గ్రామంలో జరిగిన అరిష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈ పూజ నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ఎటువంటి అవరోధాలు, ప్రమాదాలు జరగకుండా ప్రజల్ని కంటికి రెప్పలా కాపాడాలని అమ్మ వార్లను కోరుతూ పూజలు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, కుల పెద్దలు, నేతలు ఈ పూజల్లో పాల్గొన్నారు. అమ్మ వార్లను దర్శించుకున్నారు.

వైభవంగా నృసింహ చతుర్దశి పూజలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో నృసింహ చతుర్దశి పూజలు ఆదివారం వైభవంగా జరిపారు. మందిర్ నిర్వాహకులు ప్రభూజీ సుందర శ్రీనివాస్ దాస్ ఆధ్వర్యంలో నృసింహ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఐదు గంటలకు హరినామ సంకీర్తనలు, తులసి పూజ, శ్రీలక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఎనిమిది గంటలకు శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని కీర్తించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

భజన కళాకారుడి జయంతి

మామిడికుదురు: ప్రముఖ భజన కళాకారుడు దివంగత కడలి సత్యనారాయణ భాగవతార్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు బుల్లోడు వంతెన వద్ద సత్యనారాయణ చిత్రపటానికి ఆయన శిష్య బృందం పూలమాలలు వేసి నివాళులర్పించింది. కుడుపూడి కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సత్యనారాయణ చిత్రపటం వద్ద భజన గీతాలు ఆలపించారు. ఎంతో మంది భజన కళాకారులను సత్యనారాయణ తీర్చిదిద్దారని కొనియాడారు. మూడు సార్లు స్వర్ణ సింహతలాటాలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర స్థాయి భజన పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు నాగేశ్వరరావు



మట్టపర్రులో నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దేవ

మలికిపురం: మట్టపర్రు మాజీ సర్పంచ్ కడలి నాగేశ్వరరావు చిరస్మరణీయుడని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం మట్టపర్రులో గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

అయినవిల్లి: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అయినవిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ జయంతిని అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 11 ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైజ్ మనీ, మెమెంటోలను స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి వెంకట నాగ విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం దుక్కిపాటి శ్రీనివాసరావు అవార్డును రిటైర్డ్ టీచర్ బద్దె సత్య రామ ప్రసాద్‌కు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షుడు నేరేడిమిల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అబ్బు, ఆర్థిక కార్యదర్శి వెంకట్, జిల్లా కమిటీ మెంబర్లు నకులరాజు, బంగార్రాజు, జనిపే భీమారావు, శ్రీనివాసమూర్తి, రామచంద్రరావు, పలువురు ఉద్యోగులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జాగ్రత్తలే పశువులకు రక్ష



కొత్తపేటలో పశు వైద్యశాల వద్ద ఆవుకు చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

కొత్తపేట: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో పశువులకు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాయి. సహజంగా 35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు వరకూ పశువులకు ఇబ్బంది ఉండదు. ఆపై అధిక ఉష్ణోగ్రతలు నమోదైతేనే పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని, ఒక్కోసారి వడదెబ్బ కారణంగా పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉందని పశువైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికమవడంతో పాడి రైతులు పశువుల సంరక్షణపై తగు జాగ్రత్తలు తీసుకుంటూ పాడి పశువులను సంరక్షించుకోవాలని పశువైద్యాధికారులు సూచించారు. చలువ పందిళ్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2.35 లక్షల గేదెలు, ఆవులు ఉన్నాయి. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సుమారు 1.15 లక్షల పశువులున్నాయి. వేసవి ఎండలు, పాల దిగుబడి, పశువుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, స్థానిక ప్రాంతీయ పశువైద్యాధికారి డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ 'సాక్షి'కి వివరించారు.

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇందులో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంటకుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చెమటలు ఎక్కువగా బయటకు రావటం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగా మేయకపోవడం, శ్వాస కష్టంగా ఉండటం, ఎదకు సరిగా రాకపోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చికిత్స

వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణమయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్స్‌ట్రోజ్ సెలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూదిమందులను, విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ సూదిమందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.

పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు



పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ

- పశువులకు షెడ్డు ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పశువుల పాక, లేదా షెడ్డులోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి. పరిశుభ్రమైన చల్లని నీరు పశువులకు అందుబాటులో ఉంచాలి. పచ్చని గడ్డి, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి.
- సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే దోమలు, ఈగలను నిర్మూలించాలి.
- గేదెల పాకలు చల్లగా ఉండేలా చూసుకోవాలి. పశువుల పాక పైకప్పును గడ్డితో కప్పి నీళ్లు చల్లుతూ ఉండాలి. వీలైనంత వరకూ పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే కానుగ, బాదం, వేపచెట్లు పెంచుకోవాలి.
- రోజుకు రెండు, మూడుసార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి. వేసవిలో ఉదయం పది గంటలలోపు, సాయంత్రం ఐదు గంటల తర్వాత మాత్రమే మేత కోసం పశువులను బయటకు వదలాలి. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో మేతకు బయటకు వదలకూడదు.

జగ్గిరెడ్డిని కలసిన రాజోలు క్యాడర్



సూర్యారావు నాయకత్వంలో జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డిని కలసిన రాజోలు కేడర్

మలికిపురం: వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని ఆదివారం ఆ పార్టీ రాజోలు నియోజకవర్గం కేడర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆదివారం గోపాలపురంలో రాజోలు పార్టీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు నాయకత్వంలో, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు ఆధ్వర్యంలో జగ్గిరెడ్డిని కలిశారు. ఇటీవల నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జగ్గిరెడ్డిని పూలమాలలతో వారంతా సత్కరించారు. జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, బళ్ళ ప్రసన్నకుమారి, రాష్ట్ర నాయకుడు పాటి శివకుమార్, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ చెల్లింగి ఈశ్వరి, నాయకులు తాడి సహదేవ్, రుద్రరాజు రామరాజు, కూనపరెడ్డి రాంబాబు, ఈద రవిరెడ్డి, దొంగ ఏసుబాబు, గుబ్బల సత్యనారాయణ, కొల్లాటి నరసింహస్వామి, నల్లి సురేంద్ర, మందపాటి సత్యనారాయణ, ఆరిపల్లి సత్యనారాయణ, భూపతి అజయ్, సలాది సతీష్, నల్లా విజయ్ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు తోడ్పాటు

సఖినేటిపల్లి: క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పాటునిస్తాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు అన్నారు. ఆదివారం స్థానిక సువర్ణపేటలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొమ్మిది పేటల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుజ్జిరాజు ప్రారంభించారు. తాడి సహదేవ్, ఆరిపల్లి సత్యనారాయణ, సువర్ణపేట యూత్ పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు



పుల్లేటికుర్రులో ఎండతీవ్రతకు నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

అంబాజీపేట: భానుడి భగభగలకు పగలు రోడ్ల మీదకు రావాలంటే ప్రజలు హడలిపోతున్నారు. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ఉక్కబోత, వేడి గాలులు అధికమయ్యాయి. దీంతో భగభగమండే ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు రోడ్ల మీదకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఎంతో అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయటకు రాని పరిస్థితి కనిపిస్తోంది. గత నాలుగు రోజులుగా పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో అత్యధికంగా 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత నమోదవుతుంది. దీంతో ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య సమయంలో రోడ్ల మీదకు ప్రజలు రాలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఒక వేళ వచ్చినా ప్రజలు టోపీలు, నెత్తిమీద టవల్స్, గొడుగులు వంటి ప్రత్యామ్నాయాలు ఉంటే తప్ప రాలేకపోతున్నారు. మరో వైపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో ప్రజల్లో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. ఎండల తీవ్రతకు నిత్యం జన సందోహంతో రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, రహదారులు సైతం వెలవెలబోతున్నాయి. భానుడి ప్రతాపానికి భయపడి జనం రోడ్ల మీద రాకపోకలు తగ్గించడంతో వ్యాపారాలకు సైతం దెబ్బ తగిలిందని చిరు వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా ఈ సీజన్‌లో మామిడి పండ్లను పెద్ద ఎత్తున విక్రయిస్తూ ఉంటారు. అయితే ఎండ తీవ్రత ప్రజలు రోడ్ల మీదకు రావడం తగ్గించడంతో మామిడి పళ్ల కొనుగోళ్లు సైతం సన్నగిల్లినట్లు చెబుతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి సురక్షితంగా ఉండేందుకు ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా మంచినీరు, మజ్జిగ, ద్రవ పదార్థాలు వంటివి తీసుకుంటూ ఉండాలన్నారు.

ప్రతి గురుకులంలో అంబేడ్కర్ విగ్రహం



పలివెలలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో మంత్రి వీరాంజనేయస్వామి తదితరులు



పలివెలలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రతి గురుకులంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర సంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. మండలంలోని పలివెల పెదపేటలో చదువుకున్న ఐఏఎస్ అధికారి, ప్రస్తుత మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈతకోట రమేష్ కుమార్ సహకారంతో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. ఆ విగ్రహావిష్కరణ ఆదివారం ఘనంగా నిర్వహించారు. రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఆయనతో పాటు ఎంపీ గంటి హరీష్‌మాథుర్, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, హైకోర్టు రిటైర్డ్ జడ్జి సరిపెల్ల రవికుమార్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.143 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఈ సభలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎల్ సీఎండీ గుత్తాల శరత్‌కుమార్, డీఎస్పీ సుంకర మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవాల్లో మంత్రి వీరాంజనేయస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాడపాలెం పెదపేటలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి అందించేందుకు రూ.96.80 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని, మారెమ్మ మాన్యంలో రూ.77 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని మంత్రి ప్రారంభించారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలి: జగ్గిరెడ్డి

అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. పలివెల పెదపేటలో నూతనంగా నెలకొల్పిన అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అసమానతలతో అనేక వర్గాలు అవమానాలు ఎదుర్కొంటున్న పరిస్థితులను రూపుమాపి సమ సమాజ నిర్మాణానికి, అన్ని వర్గాల ఆర్థిక స్వాతంత్ర్యానికి అనుగుణంగా దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. జగ్గిరెడ్డి వెంట జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర



గ్రామంలో కొలువైన సత్తెమ్మ తల్లి

మామిడికుదురు: ఆదుర్రులోని తెలగావారి వీధిలో కొలువైన సత్తెమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆదివారం భక్తులు చలివిడి, పానకాలు, నైవేద్యాలు చెల్లించారు. చిత్ర, విచిత్ర వేషధారణలు, మేళ తాళాలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం, తీన్‌మార్ విన్యాసాల నడుమ శనివారం రాత్రి అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీపాల కాంతులతో అమ్మవారి ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. జాతర సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఇటికాలమ్మ జాతర

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన ఇటికాలమ్మ అమ్మవారి జాతరను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజఘటాలను గ్రామోత్సవం నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గంద్రోతు శ్రీనివాసరావు, కామిశెట్టి పండు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం ఆలయ ప్రాంగణం వద్ద తీర్థం నిర్వహిస్తారన్నారు.

ప్రమాదకరంగా దుంగలు



సోంపల్లిలో జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న దుంగలు

రాజోలు: 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం చెట్లు తొలగించి వదిలివేసిన దుంగలు, మోడులు ప్రమాదకరంగా మారాయి. రాజోలు సబ్‌స్టేషన్ నుంచి తాటిపాకమఠం వరకు నూతనంగా 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఒక వైపు ఫుట్‌పాత్, రెండో వైపు రెయిలింగ్ ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి రహదారిపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో జాతీయ రహదారి వెంబడి విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం తొలగించిన చెట్లు దుంగలు, మోళ్లు గత రెండు వారాలుగా వదలి వేశారు. రోడు పక్కనే ఉన్న దుంగలు వాహనచోదకులకు ప్రమాదకరంగా మారాయి. ఈ దుంగలను ఢీకొని పలువురు ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు వాపోతున్నారు. రాజోలు, సోంపల్లి, పొదలాడ గ్రామాల వెంబడి జరిగిన పనుల్లో ఎక్కడి దుంగలు అక్కడే వదిలివేశారు. దుంగల కారణంగా ఎవరి ప్రాణాలు బలికాక ముందే వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి



జాబ్‌మేళాలో ఎంపికైన వారికి పత్రాలను అందజేస్తున్న మంత్రి సుభాష్

పి.గన్నవరం: నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరంలోని శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, గిడ్డి శ్యామలారాణి ఫౌండేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో టాటా ఎలక్ట్రానిక్స్, హోసూర్ సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను వారు ప్రారంభించారు. మొత్తం 150 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 30 మందిని శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఏడాది పాటు శిక్షణలో రూ.12,500 నుంచి రూ.15 వేల వరకూ స్టైపెండ్, అనంతరం ఉద్యోగం కూడా ఇస్తారని మంత్రి వివరించారు. మంత్రి సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం యువతను కల్తీ మద్యం, గంజాయి వైపు మళ్లించిందని సుభాష్ ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, నాయకులు సంసాని పెద్దిరాజు, చొల్లంగి సత్తిబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి సన్నిధిలో పశ్చిమ జేసీ



అంతర్వేదిలో జేసీకి స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద జేసీకి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. జేసీకి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

గరుడేశ్వర స్వామి రథోత్సవం



పి.గన్నవరంలో గరుడేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పి.గన్నవరం: గ్రామంలో వేంచేసిన బాలత్రిపుర సుందరీ సమేత గరుడేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. స్వామి వారిని భక్తులు దర్శించుని, పూజలు చేశారు. ఆలయ అర్చక స్వామి భైరవభొట్ల సత్య వెంకటనారాయణమూర్తి, శివాలయం యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కాట్రేనికోన: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) విజయవాడ కేంద్రంగా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 3 ఏళ్ల డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ తెలిపారు. మూడేళ్ల డిప్లొమా కోర్సులు, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ డిగ్రీ అర్హతతో రెండేళ్ల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. మే 29లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకునే విద్యార్థులు సీపెట్ నిర్వహించే క్యాట్ పరీక్ష(సీఏటీ) జూన్ 8న నిర్వహించి, మెరిట్ ప్రాతిపదికన 150 సీట్లు భర్తీ చేస్తామన్నారు.

కన్నులపండువగా కల్యాణోత్సవం

- 40 రోజుల పాటు శ్రీమద్రామాయణ ప్రవచనాలు
- నిర్విఘ్నంగా సాగిన శ్రీరామకోటి యజ్ఞం



కొత్తపేటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్త దంపతులు

కొత్తపేట: స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో సంపూర్ణ శ్రీమద్రామాయణ ప్రవచనాల కార్యక్రమం ముగింపు సందర్భంగా సీతారాముల కల్యాణం శనివారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. ఉమా కొప్పులింగేశ్వర ప్రవచన కమిటీ కన్వీనర్ సలాది రామ్మోహనరావు (చిన్ని) ఆధ్వర్యంలో పురాణ కళావాచస్పతి, బ్రహ్మశ్రీ దెందులూరి సీతారామశర్మ గత నెల ఒకటి నుంచి ఈ నెల 10 వరకూ 'సంపూర్ణ శ్రీమద్రామాయణం' ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకూ జరిగిన ప్రవచనాల కార్యక్రమానికి కొత్తపేట పరిసర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. 40 రోజుల పాటు వివిధ కాండాలను సీతారామశర్మ తన ప్రవచనాల ద్వారా భక్తులకు కళ్లకు కట్టినట్టు వినిపించారు. ఈ ప్రవచనాలతో సమాంతరంగా శ్రీరామకోటి యజ్ఞం నిర్విఘ్నంగా సాగింది. హరిహర దేవాలయాల ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ప్రవచనకర్త సీతారామశర్మ పర్యవేక్షణలో సలాది చిన్ని–నాగకవిత దంపతులతో సీతారాముల వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రవచన కర్త సీతారామశర్మ దంపతులను పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలతో కమిటీ వారు ఘనంగా సత్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమాలకు సహకరించిన అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్, న్యాయవాది గాలిదేవర పుల్లయ్యనాయుడు, వేమవరపు మురళి, కాకరపర్తి బంగారుబాబు, బండి శ్రీను, ముద్రగడ ఫణి, హరి, సుబ్బారావు, శివ, నల్లా గోపి తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరికి మాతృదేవోభవ ఐడియల్ మదర్ అవార్డు



అవార్డు గ్రహీత రాజేశ్వరి, ఆమె కుమార్తె మెగా ప్రిన్సిని సత్కరిస్తున్న గజల్ శ్రీనివాస్

రాజోలు: శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సంబరాల్లో భాగంగా రాజోలుకు చెందిన కాట్రు రాజేశ్వరికి మాతృ దేవోభవ ఐడియల్ మదర్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం రాజేశ్వరిని పలువురు అభినందించారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఏలూరులో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో కవితోత్సవం, తెలుగు సాహితీ సదస్సు, చర్చా గోష్ఠి, రంగస్థల ప్రదర్శనలు, సంప్రదాయ కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో రాజేశ్వరి కుమార్తె చిన్నారి కాట్రు నవ్యశ్రీ (మెగా ప్రిన్సి) ప్రదర్శించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీంతో మాతృదేవోభవ ఐడియల్ అవార్డు గ్రహీత రాజేశ్వరితో పాటు, ఆమె కుమార్తె మెగా ప్రిన్సికి గజల్ శ్రీనివాస్, శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా సత్కరించారు.

భారత సైనికులకు దైవ శక్తి తోడుండాలి



వానపల్లి పళ్లాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తపేట: దేశ సరిహద్దుల్లో యుద్ధంలో పాల్గొంటున్న భారత జవాన్లకు దైవ శక్తి కూడా తోడుగా ఉండి.. మన జవాన్లకు ప్రాణనష్టం జరగకుండా.. దొంగ వైఖరి చూపిస్తున్న పాకిస్తాన్‌ను మట్టి కరిపించాలని రెండో కార్యక్రమంగా మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మవారి దేవాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకుడు ఇళ్ల పల్లంచెట్టి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, జిల్లా, మండల బీజేపీ నాయకులు గొలకోటి వెంకటేశ్వరరావు, బొర్రా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.